# సాధన

**- ఘండికోట బ్రహ్మాజీరావు**

తాతగారు పొద్దున్న ఏడుగంటలకి మార్నింగ్ వాక్ కోసం బయలుదేరడానికి చేతికర్ర వెతుక్కుంటున్నారు.

తాతగారు, మనుమలు ఒక పావుగంట వెతికిన తరువాత అందరికన్న చిన్న మనుమడు, ఆరేళ్ల కళ్యాణ్ మెల్లిగా అన్నాడు.

''నిన్న సాయంకాలం ప్రవీణ్ అన్నయ్య డాబా మీద దానితో హాకీ ఆడాడు.''

మనుమరాలు భవాని డాబామీద నుంచి చేతికర్ర తెచ్చి యిచ్చింది. కర్రకు సచేల స్నానం చేయించి అటుపిమ్మట తాతగారు వాహ్యాళి వెడలారు.

మరో రెండు రోజుల తరువాత, శుక్రవారం ఉదయం, కాన్వెంటులో చదువుతున్న సుషుమ మేజోళ్లు కనిపించలేదు. ప్రతి శుక్రవారం డ్రస్సు, మేజోళ్లు, కెట్సు అన్నీ తెల్లవే వేసుకోవాలి. మే జోళ్లు వేసుకోకపోతే జరిమానా వేస్తారు. ఇంటిల్లిపాదీ వెతికితే మరో అరగంటకి అవి ఏమూలనో దొరికి అమ్మాయి బడికి వెళ్లింది.

ఒకరోజు ప్రవీణ్ జోళ్లలో ఒకటి కనిపించలేదు.

భవాని ప్రాక్టికల్ రికార్డు తాతగారి పుస్తకాలలో కలిసిపోయి రెండు రోజుల వరకు బయట పడలేదు.

పెద్ద మనుమరాలు బివిస్సీ పాసయి కంప్యూటరు ట్రయినింగు అవుతున్నది. స్నేహితురాలి బర్తుడే పార్టీకి గోళ్ల రంగు దొరకక అరగంట ఆలస్యమయింది.

కళ్యాణ్ అందరినీ కనిపెడుతూ ఉంటాడు కాబట్టి, వాడి పుస్తకాలు, జోళ్లు జాగ్రత్తగా దాచుకుంటాడు.

ఇవన్నీ బాగానే ఉన్నాయి. ఒక రోజు అమ్మమ్మ చేతిగావంచాతో జోళ్లు తుడుస్తే తాతగారికి కోపం వచ్చింది. మనుమలింత బాధ్యత లేకుండా ఉన్నారా అని.

ఇంకా పెద్ద మనుమరాలు ఇంజనీరింగు చదవడం చేత, వాళ్ల గదులు, పుస్తకాలు వాళ్లే చూసుకునేవారు.

ఇంట్లో మనవల అవకతవక పనులు తగ్గకపోగా తాతగారు వారం రోజులు ఆలోచించి చివరికొక నిర్ణయానికి వచ్చారు.

ఒక సెలవు రోజున మనుములందరినీ తన గదిలోకి పిలిపించారు. అందరిని తన ఎదుట, చాప మీద కూర్చోబెట్టారు. స్వీటు, హాటు, సాఫ్ట్ డ్రింకు ఒకరొకరికి యిచ్చారు.

''మీరందరూ మంచి స్కూళ్లలో చదువుతున్నారు. ఈమధ్య జన్మభూమి కార్యక్రమంలో పాల్గొని దేశానికి చాలా మేలు చేశారు. ఇంట గెలిచి రచ్చ గెలవాలి అన్న సామెత ఒకటుంది. మీరందరూ రచ్చగెలిచి విజయం సాధించుకొని వచ్చారు. ఇప్పుడు యింట గెలువవలసిన పని మీ మీదుంది.''

పెద్ద మనుమరాలు శైలజ, తరువాతది భవాని, ప్రవీణ్, సుషుమ, కళ్యాణ్- అందరూ తాతగారి మాటలు బోధపడనట్లు ఆయన ముఖంలోకి చూశారు.

''ఇల్లు సర్దుకోడం ఒక కళ'' అన్నారు తాతగారు.

ఇంకా బోధపనట్లు మనుమలు చూశారు.

''వివరంగా చెప్తున్నాను, వినండి. మగపిల్లలు చదువుకోడానికి, పడుకోడానికి ఒక గది, ఆడపిల్లలకొక గది ఉన్నాయి. అలమరాలు, టేబిళ్లు, మంచాలు అన్నీ అమరి ఉన్నాయి. కానీ, మీరు ఎక్కడి వస్తువులు అక్కడే పారేసి, అవసరమైన వస్తువులు సమయానికి దొరక్క అవస్థ పడుతున్నారు. అవునా, కాదా చెప్పండి?''

అందరూ మెల్లమెల్లగా తలలూపారు.

''అందుకోసమే యిల్లు దిద్దుకోడం అవసరమనిపించింది.''

ఎవరూ కాదనలేదు.

''మనం ఈపని కోసం ఒక ఇరవై సూత్రాల ప్రణాళిక తయారుచేద్దాం. బాగా చర్చించి, అందరం ఒప్పుకున్న తరువాతే వాటిని పట్టీగా తయారుచేద్దాం. ఇది మీరందరూ అంగీకరిస్తారా?''

అందరూ తలలూపారు.

''వేగంగా నిద్రలేవడం, దంతధావనం, స్నానం మొదలైనవి ఉండనే ఉన్నాయి.'' అన్నారు తాతగారు.

''కాని ఎవరు ముందు బాత్‌రూములోకి వెళ్లాలి?'' శైలజ ప్రశ్నించింది.

తర్జన భర్జన అయిన తరువాత భవాని, ప్రవీణ్, సుషుమ, కళ్యాణ్, శైలజ, ఒకరి తరువాత ఒకరు వెళ్లి పావుగంటలో బైటికి రావాలని తాతగారు ఖరారు చేశారు.

''లోపల ఈలకొట్టడం కాని, పాటలు పాడడం కాని పనికిరాదు.'' అంది సుషుమ ప్రవీణ్‌వైపు చూస్తూ.

''ఇటువంటి వాటిని బైలాస్ అంటారు. ముఖ్య సూత్రానికి ఇది అనుబంధం.'' అన్నారు తాతగారు.

పక్కలు దులిపి వేసుకోవాలని, ఎక్కడ తీసిన వస్తువులు అక్కడే పెట్టాలని, మరునాటికి కావలసిన స్కూలు పుస్తకాలు ఈ రాత్రే సర్దుకోవాలని, ఇలా ఇలా సూత్రం తరువాత సూత్రం ఆమోదించడం జరిగింది.

అప్పటికి మూడు సూత్రాలు మాత్రమే మిగిలాయి.

''అమ్మమ్మ మడికి ఆరవేసుకున్న చీర ముట్టుకోకూడదు.'' అన్నారు తాతగారు మరొక సూత్రం ప్రతిపాదిస్తూ.

మనుమలు ఒకరి ముఖం ఒకరు చూసుకున్నారు.

''దానికో బైలా చేర్చాలి'' అంది భవాని.

''ఏమిటది?'' తాతగారు అడిగారు.

''ఒకవేళ ముట్టుకున్నా చెప్పకూడదు.''

తాతగారు ఆశ్చర్యంతో ఆ అమ్మాయి ముఖం చూశారు.

మొత్తానికి ఇరవై సూత్రాలు ఆమోదించడం జరిగింది.

రాబోయే ఒకటో తారీఖు నుండి ఆ సూత్రాలను శ్రద్ధాభక్తులతో పాటించడానికి అందరూ అంగీకరించారు.

తాతగారు ఒక నెలరోజులు వింశతి సూత్ర కార్యాచరణక్రమాన్ని పర్యవేక్షించారు.

ప్రోత్సాహకరమైన ఫలితాలు కనిపించాయి.

మనుమల మీద ఆయనకు సదభిప్రాయం కలిగింది.

ఇంత క్రమశిక్షణ కోరే తాతగారికి కొన్ని బలహీనతలున్నాయి.

ఆయనకు కవిత్వమన్నా కథలన్నా చాలా ఆసక్తి.

అప్పుడప్పుడు ఒకటీ అరా ఆయన వ్రాయడం కద్దు.

ఒక సాహిత్య సమావేశంలో ఒక యువకవి

తాతగారితో పరిచయం చేసుకొని, ఆయన బలహీనతను క్యాష్ చేసుకున్నాడు.

ప్రతి గురువారం సాయంకాలం నాలుగు గంటలకు తాతగారి దగ్గరికి వచ్చి, తాను వ్రాసిన గేయమో, కథో వినిపించడం ఆయనకు రివాజయింది.

అతిథి మర్యాదలలో తాతగారిని ఎవరూ మించ లేరు.

కుర్రకవి మస్తుగా ఫలహారం లాగించి, మంచి బ్రూ కాఫీ సేవించనిదే తన రచన వినిపించే వాడు కాదు.

ఒక గురువారం స్కూళ్లకు సెలవయితే పిల్లలందరూ ఇంట్లోనే ఉన్నారు. యథాప్రకారం సాయంకాలం వచ్చి తాతగారితో కూర్చున్న యువకవిని చూసి వాళ్ళు ఆశ్చర్యపోయారు.

గదిలోపల పిల్లకవి వంటాయనతో మసాలా దోసెలు తయారుచేయడం గురించి చెప్తుంటే వాళ్ళు పక్క నుంచి విన్నారు.

''సుందరరామయ్యా! దోసె తిరగవేసిన తరువాత దానిమీద రెండు చెంచాల వెన్న రాయి. కొంచెం ఛీజ్ వెయ్యి. అప్పుడు కూర వేసి దోసె మడతపెట్టు. వేడికి వెన్న, ఛీజ్ కరిగి కూరతో కలిసి...''

ఇంతవరకు విన్న పిల్లలందరూ ముక్కుల మీద వేళ్లు వేసుకున్నారు.

ఆఖరి మనుమడు కళ్యాణ్ బాగా సినిమాలు చూడడమే కాకుండా, పాటలు కూడా చక్కగా పాడుతాడు. డాన్సులు కూడా చేస్తాడు. పిల్లలందరూ వాడిని ముందుకు తోస్తే తాతగారి గది ద్వారం దగ్గర వాడు పాడుతూ డాన్సు చేయడం మొదలుపెట్టాడు.

యువకవి గారి కావ్యగానానికి ఆటంకం కలిగింది. ఆయన కోపంతో పిల్లలందరినీ కేకలేసి అక్కడ నుంచి వెళ్లిపొమ్మన్నాడు.

ఇది కూడా వాళ్లలో అసంతృప్తి నెలకొలిపింది. యువకవి మీద వాళ్లకు కోపం కలిగింది.

కవి కిశోరుడు క్రమంగా పరిస్థితులకు ఆధిపత్యం వహించి రాబోయే వారం ఏ టిఫిన్ తయారు చెయ్యాలో, ఎలా తయారుచెయ్యాలో చెప్పడం మొదలు పెట్టాడు.

అలా చూస్తుండగా గురువారం రానే వచ్చింది.

కూడబలుక్కున్నట్లు పిల్లలందరూ ఏదో నెపం చెప్పి ఆరోజు స్కూళ్లకు వెళ్లడం మానేశారు.

మధ్యాహ్నం భోజనాలయి పోయాయి.

మంచి నీళ్లకని ప్రవీణ్ వంటింటి వేపు వెళ్లాడు. అక్కడ వంటాయన గ్రైండరులో మినప్పప్పు రుబ్బుతున్నాడు.

''సుందర రామయ్యగారూ! ఏమిటి విశేషం?'' మంచి నీళ్ళు తాగిన తరువాత ప్రవీణ్ ప్రశ్నించాడు.

''వీడెవడో కుర్ర కవిగాడు ప్రాణాలు తీసేస్తున్నాడు. ఇవాళ పెరుగు గారెల గురువార మన్నాడు. పెరుగు పులియకుండా పొద్దున్నే తోడు పెట్టమన్నాడు. వేయించిన గారెలను అచ్చగా పోపు పోసిన పెరుగులో వెయ్యమన్నాడు. పచ్చి మిరపకాయలు లేతవి జాగ్రత్తగావించి, చిన్న ముక్కలు తరిగి, నోటికి కారం తగలకుండా, మిరప వాసన వేసేటట్లు...'' అన్నాడు వంటాయన.

''ఈ మహానుభావుడు ఇక్కడ కూడా కవిత్వం వెలగబెడుతున్నాడా?''

''ఏం కవిత్వమో! మీ తాతగారు వాడు ఆడినదే ఆటగా...''

''అవునవును. మమ్మల్ని ఆయన కంట్రోలు చేశారుగా! మరి వాడిని చెయ్యలేకపోయారు.''

''మరేం-ప్రవీణ్! పచ్చి మిరప కాయలు నిండుకున్నాయి. ఇదిగో రెండు రూపాయలు తెచ్చిపెట్టు బాబూ.''

ప్రవీణ్ బజారుకెళ్లి తిరిగి వచ్చాడు. దుకాణాలు మూసేశారని.

యువకవి సరిగ్గా నాలుగు గంటలకు వచ్చి తాతగారి గదిలో కూర్చున్నాడు.

తాతగారు అతిథిని ఆహ్వానించి, చల్లటి నీళ్లు యిచ్చి, సంభాషణకు ఉపక్రమించారు.

మరొక్క పది నిమిషాలలో పిల్లలు ఒకరూ ఒకరూ పక్క గదిలోకి చేరుకున్నారు.

సుందరరామయ్యగారు టిఫిన్, అంటే, పెరుగు గారెలు చక్కగా ప్లేట్లలో పెట్టి తాతగారి గదిలోకి ప్రవేశించాడు.

**భవాని తబలా తీసుకుంది. ప్రవీణ్ చేతిలో వేణువు మెరిసింది. సుషుమ వయొలిన్ కమాను తుడిచింది. కళ్యాణ్ గొంతు సవరించుకొని మఠం వేసి కూర్చున్నాడు. పక్క గది నుండి మాటలు వినిపిస్తున్నాయి.**



తాతగారికొక ప్లేటు-రెండు కన్న హెచ్చు తినరాయన.

కవిగారికో ప్లేటు-అంటే మొదటికోర్సు-రెండు.

పెరుగు గారెలు చాలా బాగున్నాయి.

తాతగారు మంచి నీళ్లు తాగారు.

సుందరరామయ్యగారు, రెండోకోర్సు, మరో రెండు పెరుగుగారెలు కుర్రకవికి వడ్డించారు.

ఒకటి రెండు పచ్చి మిరపకాయ ముక్కలు పళ్లకింద పడ్డా, ఏమీ అనకుండా లాగించాడాయన.

మూడవ కోర్సులో వడ్డించిన రెండు పెరుగు గారెలు పూర్తిచేసేసరికి కారం తలకెక్కి, కళ్లంట నీళ్లు ప్రవహించి, ఎక్కిళ్లొచ్చి యువకవికి మూర్ఛపోయినంత పని అయింది.

అంతా ప్రవీణ్ రహస్యంగా మధ్యాహ్నం చెప్పినట్లే జరిగింది.

వంటాయన పరుగులు తీసి, పంచదార తెచ్చి నోటిలోకుక్కి తాళువ మర్దించి ఉపశమనాలతో ఆయనను ఒకదారికి తెచ్చేసరికి అరగంటయింది.

ఈలోగా పక్కగదిలో పరచిన చాపలమీద మనుమలందరూ ఒక పద్ధతిలో కూర్చున్నారు.

తాతగారికి సాహిత్యమెంత ప్రియమో సంగీతమంటే అంతప్రేమ. తాను పాడలేకపోయినా, మంచి కీర్తనంటే ఆయన చెవులు కోసుకుంటారు. ఆయన తన పిల్లలకు చెప్పించలేకపోయినా మనుమలకు మాత్రం ఆరు నెలల నుండి సంగీతం చెప్పిస్తున్నారు.

శైలు ముందు కూర్చుంది.

భవాని తబలా తీసుకుంది.

ప్రవీణ్ చేతిలో వేణువు మెరిసింది.

సుషుమ వయొలిన్ కమాను తుడిచింది.


కళ్యాణ్ గొంతు సవరించుకొని మఠం వేసి కూర్చున్నాడు.

పక్క గది నుండి మాటలు వినిపిస్తున్నాయి.

''ఏం సుందరరామయ్యా! ఇంత గడ్డుకారం ఎలా వేశారయ్యా?'' తాతగారి ప్రశ్న.

''ఏం చెప్పను బాబుగారూ! గారెలు చేసే వేళకి యింట్లో పచ్చిమిరపకాయలు నిండుకున్నాయి. ప్రవీణ్‌ని బజారుకు పంపించాను. కొట్లుమూసేశారు. అప్పుడు అమ్మగారి తులసి కోట పక్కను వేసిన పచ్చిమిరప చెట్ల నుండి, నాలుగే కాయలు కోసివేశాను.'' అది వంటాయన జవాబు.

''చంపేశావయ్యా. బజారులో మంచి రకం చీమమిరపకాయలు దొరకడం లేదంటే, కోరా పుట్టి నుంచి నారు తెప్పించి తులసి కోట పక్కను వేశాను. ఎంత పని చేశావ్?''




మరో పది నిమిషాల వరకు అంతటా నిశ్శబ్దం.

యువకవిగారు దారిలోకి వచ్చినట్లున్నారు.

తరువాత ఆయన ఉపోద్ఘాతం వినిపించింది.

''శాస్త్రిగారు! నా మూడ్ చెడిపోయింది. అయినా మీ కోరిక నిరాకరించలేక చదువుతున్నాను. ఈ కథని పోటీకి పంపుతున్నాను. తప్పకుండా మనకు మొదటి బహుమతి పది వేలు వచ్చి తీరుతుంది. మొట్ట మొదట వినే భాగ్యం...''

పక్క గదిలో పిల్లలు సర్దుకున్నారు.

పిళ్లారి గీతం

మాయా మాళవ గేళ రాగం.

సా పా సా

శ్రీగణనాథ సిందూర వర్ణ

. . .

శైలు గొంతు పెంచింది.

భవాని తబలా మీద దరువులు వేసింది.

ప్రవీణ్ వేణువు వాయించాడు

సుషుమ వయొలిన్ మీద కమాను లాగింది.

కళ్యాణ్ గొంతెత్తి అందుకున్నాడు

కరుణ సాగర కరివదన

లంబోదర లకుమికయా

అంబాసుత అమర వినుత

గొంతులు వాద్యాలు మేళవించాయి

తాతగారికి వినికిడిలో చిన్న యిబ్బంది-

కారంతో మూసుకుపోయిన కవిగారి గొంతు విడక...

ఒక్క పదిహేను నిమిషాలు

గందరగోళం-

కుర్రకవి దస్త్రం కట్టి లేచిపోయాడు.

తాతగారి ప్రార్థనలు వినిపించుకోలేదు.

సంగీతం తారస్థాయికి చేరుకుంది.

రసాభాస-

కవి వెళ్లిపోయాడు.

తాతగారికి చాలా కోపం వచ్చింది.

లేచి పక్క గది గుమ్మం దగ్గిర నిలబడ్డారు.

''ఏమర్రా! మీకు మతులు పోయాయా?'' ఆయన గర్జించారు.

పిల్లలందరూ లేచి నిలుచున్నారు.

ఎవరూ వెంటనే జవాబు చెప్పలేదు.

రెండు నిమిషాల మౌనం తరువాత ప్రవీణ్ అన్నాడు

''సంగీతం గురించి మన ఇరవై సూత్రాల ప్రణాళికలో లేదు.''

''పోనీ యిరికిద్దామన్నా మరో అయిదు నెలలు వేచి యుండాలి.'' అంది భవాని.

''అయితే అంత వరకూ ఈ మాదిరిగానే...?'' తాతగారు ప్రశ్నించారు.

''అందుకు సందేహమా?'' అంది సుషుమ

మాట లేకుండా ఆయన గుమ్మం దగ్గిర నిలబడ్డారు.

కళ్యాణ్ ఆలోచించి, ఆలోచించి మెల్లగా అన్నాడు,

''సాధనమున పనులు సమకూరు ధరలోన
విశ్వదాభిరామ......''

అందరూ పకాలున నవ్వారు.

ఆ నవ్వులలో తాతగారన్న ''డామిట్! కథ అడ్డంగా తిరిగిందే!'' అన్న మాటలు ఎవరికీ వినిపించలేదు.

★

## స్టేట్‌మెంట్



'మాస్టర్' ఊహించినంత విజయం సాధించక పోయినప్పటికీ చిరంజీవి ఆ చిత్రం గురించి గొప్ప స్టేట్‌మెంట్ ఇచ్చాడు. 'ఈమధ్య కాలంలో 'హిట్లర్' హిట్టే గానీ 'మాస్టర్' సూపర్ హిట్. ఇది గ్యాంగ్‌లీడర్, ఘరానా మొగుడు చిత్రాల రేంజ్ హిట్' అంటున్నాడు. ఈ స్టేట్‌మెంట్ వినడంతోనే పరిశ్రమలోని చాలా మంది నవ్వుకున్నారట. ఫ్లాపులు వచ్చినప్పుడే హుందాగా వుండాలి, నిజాలు చెప్పాలి. చిరంజీవి 'మాస్టర్' హిట్ స్థాయి గురించి వినిపించిన తీరు, 'తనకూ చీప్ పబ్లిసిటీ అవసరపడింది' అని ఆయన అనుకుంటున్నట్టుగా అనిపించేలా వుందని సినీ జనాల గుసగుసలు.

-జె.వి.బాబు